క్లుప్తంగా

పోలీస్ కోఆపరేటివ్ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ భాస్కరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ సంక్షేమంలో భాగంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలో కోఆపరేటివ్ భవన నిర్మాణానికి జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఎస్పీ డి.మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు భవన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా ఈ భవన నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ బి.ఆదిప్రసాద్, ఏఆర్డీఎస్పీ బి.చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఎస్పీ పీఏ అబ్దుల్ అలీం, కో ఆపరేటివ్ సెక్రటరీ హలీమ్, త్రీ టౌన్ ఏఎస్సై రామకృష్ణ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఆర్.నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డులు

ఏలూరు రూరల్ : క్రాంతి జ్యోతి, సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు గుడిమెల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఏలూరు ఎంఈఓ కార్యాలయంలో జి.నాగమణి, సుదర్శనం మేరీ సునీత, సొంగా ఝాన్సీరాణి, ఘంటా నాగభూషణమణి, ఎస్ మీనాక్షి, ఎస్ సరళకుమారి, కె.కుమారి, కారుమూరి వెంకటలక్ష్మి, ఎండీ అక్బరున్నీషావలి, ఎండీ కరీంభేగం అవార్డులు అందుకున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ జె.రవీంద్ర, ఏలూరు జిల్లా డీసీసీబీ సెక్రటరీ ఎ.సర్వేశ్వరరావు, బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిమనోజ్ కుమార్, పి.సాల్మన్, సీహెచ్ దర్మలింగం, జి.వెంకటరమణ పాల్గొన్నారని తెలిపారు.

నేడు భూ యాజమాన్య చట్టంపై సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏపీ భూ యాజమాన్య చట్టం 2022పై చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 5న సాయంత్రం ఐదు గంటలకు ఆర్ఆర్‌పేట సీపీఐ రోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించనున్నట్టు చైతన్య వేదిక అధ్యక్షుడు, న్యాయవాది పీఎస్ చందు తెలిపారు. ప్రధాన వక్తగా సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, ఏపీ భూ యాజమాన్య చట్టంపై న్యాయవాది పి.రతన్‌రాజు తదితరులు మాట్లాడతారని పేర్కొన్నారు.

అభివృద్ధి చూసి ఓటేయండి

కొల్లేరు గ్రామాల్లో అబ్బయ్యచౌదరి



విద్యార్థికి ట్యాబ్ అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు



ప్రత్తికోళ్లలంకలో ఇంటి స్థల పట్టా పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రజలను కోరారు. బుధవారం రాత్రి పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే గురువారం ఉదయం ప్రత్తికోళ్లలంక, సాయంత్రం కొక్కిరాయిలంకలో తన ప్రజా ఆశీర్వాద యాత్రను కొనసాగించారు. ప్రత్తికోళ్లలంక గ్రామ కూడలిలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ నాయకులు పథకాల ఆశ చూపి కొల్లేరు గ్రామాల ప్రజలను వర్గాలుగా విభజించి అధికారం చెలాయించారని గుర్తుచేశారు. నేడు వైఎస్సార్ సీపీ పాలనలో కులం, మతం, వర్గభేదం లేకుండా లంక గ్రామాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఊరులో తాగునీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్, కుళాయితో పాటు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించామన్నారు. సుమారు రూ.కోటి ఖర్చు చేసి ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ క్లినిక్ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. టీడీపీ అబద్ధాలకు మోసపోవద్దని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి, ఏలూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఆలోచనలను అమలు చేస్తోన్న నాయకుల్లో అబ్బయ్యచౌదరి ఒకరని కొనియాడారు. పథకాలు అమలు కావాలంటే మరోసారి అబ్బయ్యచౌదరిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. తొలుత మండల పరిషత్ నిధులు రూ.25 లక్షల బీసీ కాలనీలో అభివృద్ధి చేసిన సీసీ రోడ్లు, మరో రూ.13.44 లక్షల నాడు నేడు నిధులతో చేపట్టిన మండల పరిషత్ పాఠశాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గడప గడపకు వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ లబ్ధిని వివరించారు. కొత్త లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. అక్కడ నుంచి పాదయాత్రగా కొక్కిరాయిలంక చేరుకున్నారు. ఎస్సీ కాలనీలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అక్కడ నుంచి గుడివాకలంక చేరుకుని రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఉదయం మొండికోడు, మాధవాపురం, కోటేశ్వరదుర్గాపురం, తిమ్మారావుగూడెం వరకు పాదయాత్ర చేసి, చాటపర్రులో పల్లె నిద్ర చేయనున్నారు. ఎమ్మెల్యే వెంట వడ్డీకుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీపీ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈఓ-2 రంగయ్య, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, మండల కొండలరావు, సర్పంచ్‌లు ఘంటసాల మహలక్ష్మీరాజు, తోకల అమల, పలువురు పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుండె నొప్పులపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డాక్టర్ ధరణీంద్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గుండె నొప్పులపై నిర్లక్ష్యం వీడాలని డాక్టర్ ఎం.ధరణీంద్ర తెలిపారు. గురువారం స్థానిన సీఆర్ఆర్ మహిళా కళాశాలలో అధునాతన కార్డియో వాస్కులర్ లైఫ్ సపోర్ట్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏటా గుండె నొప్పితో ఆరు లక్షల మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండెనొప్పికి గురి కావడానికి డీ హైడ్రేషన్, లో షుగర్, కార్డియాక్ అరెస్ట్, మత్తు పదార్థాలు, మద్యపానాలే ప్రధాన కారణమని వివరించారు. గుండెపోటుతో అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తి నాడి కొట్టుకోని పరిస్థితిలో తక్షణమే సీపీఆర్ ప్రారంభించాలన్నారు. చాతి మధ్యలో 5 సెంటీమీటర్ల లోపలికి నొక్కాలని, నిమిషానికి 120 సార్లు నొక్కాలని, ప్రతి 30 కంప్రెషన్స్ తర్వాత రెండు సార్లు అంబు బ్యాగ్ ద్వారా ఊపిరి అందించాలని, అందించే ముందు గడ్డం, తలను పైకి లేపాలని తెలిపారు. వీటన్నింటికంటే ముందు అంబులెన్స్‌కు ఫోన్ చేసి రప్పించి ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ పి.శైలజ, జువాలజీ శాఖ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

15వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ



మహిళలకు పింఛన్ సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్ : సంక్షేమ పథకాల అమలుతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో నిలిచిపోయారని ఏలూరు 15వ డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. గురువారం డివిజన్‌లోని పేదలకు రూ.3000 పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గతంలో ఎన్నడూ చూడలేదని చెప్పారు. పింఛన్ సొమ్ము పెంపు, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, జగనన్న ఇళ్లు, వైఎస్సార్ ఆసరా పథకాలు పేదలను ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాయని వివరించారు. ప్రతి కుటుంబాన్నీ సంక్షేమ పథకంతో ఆదుకున్న ఒకే ఒక్క నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచడం హర్షణీయమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఏలూరు నియోజకవర్గంలో ఆళ్ల నాని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాము వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితురాలికి పింఛన్ అందజేత



బాధితురాలికి పింఛన్ అందిస్తున్న వాలంటీర్

ఏలూరు (టూటౌన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన స్థానిక తంగెళ్లమూడి 47వ డివిజన్ కుమ్మర్ల వీధికి చెందిన కరప వెంకట భాగ్యలక్ష్మికి ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో పింఛన్ మంజూరైంది. ఆమెకు వాలంటీర్ షేక్ ముంతాజ్ గురువారం కొత్త పింఛన్ సొమ్ము అందజేశారు. తాను అడిగిన వెంటనే పింఛన్ మంజూరు చేసి సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. తను రెండు సార్లు సదరం స్లాట్లు బుక్ చేస్తే రిజెక్టయ్యిందని, ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నానికి తన గోడు వినిపించడంతో తక్షణం పింఛను మంజూరు చేయించారని ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీవారి ధనుర్మాసోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు శ్రీవారి వైభవాన్ని చాటుతున్నాయి. నిత్యం ఆలయంలో సుప్రభాత సేవకు బదులు, తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు. స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం నిర్వహించిన శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేశారు. ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధుల్లో ఊరేగించారు. ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి హారతులిచ్చారు.

నాణ్యమైన విద్య అందించాలి



డెమొక్రటిక్ పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందించడానికి అంకితభావంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఉపాధ్యాయులకు సూచించారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర డైరీని ఆయన గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను మరింత చేరువ చేయాలని, ఇంగ్లిష్ భాషలో విద్యార్థులను మెరికల్లా తయారు చేయాలని సూచించారు. విద్యారంగంలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిపే బాధ్యతను ఉపాధ్యాయులు స్వీకరించాలని, 10వ తరగతిలో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణులయ్యేలా సృజనాత్మక బోధనా పద్ధతులు అవలంబించాలని అన్నారు. కార్యక్రమంలో డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర రావు, జిల్లా అధ్యక్షుడు కె.గంగాధర్, ఏలూరు మండల అధ్యక్షుడు ఎస్ ఆజాద్, రాష్ట్ర కార్యదర్శి ఎస్ వీరబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.లక్ష్మి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.సూర్యచంద్ర, నాయకులు టి.సందీప్, ఆర్ నాగేంద్రసింగ్, కె.రాంబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ప్రదర్శించిన సంగీత, హరికథ, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సాయంత్రం నగరానికి చెందిన వెంపరాల రామలక్ష్మీ శాస్త్రి శ్రీరామ గానలహరి గానం భక్తులను అలరించింది. ముదపాక బాల సుందరం భాగవతార్ విరాటపర్వం అంశంపై చేసిన హరికథా కాలక్షేపం ఆకట్టుకుంది. రాత్రి నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధి

భీమడోలు: నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలంతా రుణపడి ఉంటామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో నాబార్డ్ నిధులు రూ.1.30 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. 9 తరగతి గదులను ప్రజాప్రతి నిధులు, 30 పడకల భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డ్ నిధులు రూ.2.30 కోట్లతో అధునీకరించిన ఓపీ బ్లాక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి విభాగాన్ని సందర్శించి అక్కడ రోగులకు చేసే వైద్య సేవల వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య సంస్కరణల ద్వారా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్న తపనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసుపత్రులను ఆధునికీకరించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.శ్యాంసుందర్, సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చింతా శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు నేడు విధుల్లో చేరాలి

పెదపాడు: అంగన్‌వాడీలు ధర్నాను విరమించి శుక్రవారం విధుల్లో చేరాలని ఐసీడీఎస్ పీడీ కేవీఎల్ పద్మావతి కోరారు. పెదపాడు బళ్ల రేవు తూము సెంటర్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సమ్మె శిబిరం వద్దకు చేరుకుని వారికి పలు సూచనలు సలహాలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలకు ఆటంకం ఏర్పడిన కారణంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, అణగారిన వర్గాల ప్రయోజనాలు దృష్ట్యా అంగన్‌వాడీలు సమ్మె విరమించాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం కూడా ఒకటి రెండు మినహా ప్రధాన సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి, ఏసీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు వి.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ మీట్‌లో కానిస్టేబుల్ ప్రతిభ

దెందులూరు: దెందులూరు మహిళా కానిస్టేబుల్ ప్రసన్న జిల్లాస్థాయిలో మరోసారి సత్తా చాటింది. గురువారం ఏలూరులో జిల్లాస్థాయి పోలీస్ మీట్ జరిగింది. పోలీస్ మీట్‌లో నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని దెందులూరు పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కె..ప్రసన్న గౌరి షాట్‌పుట్‌లో మొదటి స్థానం సాధించింది. అలాగే 100 మీటర్ల పరుగులో మూడో స్థానం సాధించింది. ప్రసన్న గౌరిని హెడ్ కానిస్టేబుల్ హమీద్, గోపి, శేఖర్ తదితరులు అభినందించారు.

మేనేజ్‌మెంట్ రంగంలో ఉపాధి అవకాశాలు అధికం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం మేనేజ్‌మెంట్ రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తున్నాయని బెంగళూరుకు చెందిన యాక్సెంచర్ సంస్థ మానవ వనరుల మేనేజర్ ప్రతీక్ భరత్ పటేల్ తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ రంగం నూతన పోకడలు – ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై గురువారం ఆయన అతిథి ఉపన్యాసం ఇచ్చారు. తాను సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేశానని, ఆ మూలాల వల్లే ఎంతో ప్రతిష్టాత్మక సంస్థలో ఉద్యోగావకాశం లభించిందని గుర్తుచేశారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు అంకితభావంతో లక్ష్యాలు సాధించే దిశగా విద్యాభ్యాసం పూర్తి చేయాలని, ఈ విభాగంలో కెరీర్‌ను సంపూర్ణ స్థాయిలో నిర్మించుకునే అవకాశాలు పుష్కలంగా అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, ప్రిన్సిపాల్ కొండ్రెడ్డి వెంకటేశ్వరరావు, ఎంబీఏ హెచ్ఓడీ కొడాలి శ్రీధర్, కోఆర్డినేటర్స్ మండ సుష్మ, కమ్మ ఆశ శ్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు(మెట్రో): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు ఆవిష్కరించారు. బీసీలు ఐక్యతతో ముందుకు నడవాలని జగన్ ప్రభుత్వం బీసీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వారు చెప్పారు. సంఘ అధ్యక్షుడు రాజగోపాలాచారి మాట్లాడుతూ బీసీలకు రాజకీయ అవకాశాలు ఎక్కువ శాతం కల్పించిన ఏకైక ఎమ్మెల్యే ఆళ్ల నాని అని కొనియాడారు. రాష్ట్ర బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విటల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు యేసు రాజు, నాగ వంశీయ సంఘం అధ్యక్షుడు బాయి వెంకట్రావు, ఈదలాడ నాని, కుమార్, తనూజ్, కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనుల పరిశీలన

పెదపాడు: పెదపాడు-పెరికీడీ సీసీ రహదారి పనులను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. రహదారి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలుకు అనుగుణంగా రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఆమె వెంట జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు ఎంపీడీఓ సబ్బితి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి

దెందులూరు: మండల వైఎస్సార్ సీపీ నూతన కమిటీ సమన్వయం, అంకితభావం, ప్రణాళికతో వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి విశిష్ట సేవలందించాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం శ్రీరామవరంలో నూతన కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మీ సేవలను గుర్తించి, గౌరవించి మండల కమిటీలోకి తీసుకున్నారన్నారు. నియోజకవర్గంలో దెందులూరు మండల కమిటీ జిల్లాలోని ఆదర్శవంతమైన కమిటీగా సేవలందించేలా కృషి చేయాలని కోరారు.

రాజమండ్రికి తరలిన శ్రీవారి ధర్మప్రచార రథం

ద్వారకాతిరుమల: తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి గైట్ కళాశాలలో జరిగే తెలుగు మహాసభలకు శ్రీవారి ధర్మప్రచార రథం గురువారం తరలివెళ్లింది. ముందుగా రథం లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి చేరుకుంది. అక్కడ అర్చకులు కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. అనంతరం రథం రాజమండ్రికి పయనమైంది.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	34	బిళ్లచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	56
బెండకాయలు	54	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	40	కంద	56
కాకర కాయలు	64	బీట్‌రూట్	40
బీరకాయలు	50	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	68	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	24	అల్లం	120
క్యారెట్	44-58	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	25-30	తోటకూర	12
గోరుచిక్కుడు	48	గోంగూర	08
దోసకాయలు	34-40	పుదీనా	05
ఆనబకాయ (1)	40	క్యాప్సికమ్	92
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్ఈఎల్	22.15	4822	19
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు -తిరుపతి	16.00	4830	25